క్లుప్తంగా

ప్రశాంత పోలింగ్‌కు పటిష్టంగా వ్యవహరించాలి


మాట్లాడుతున్న ఎస్పీ ఎం.దీపిక

చీపురుపల్లి: ప్రతి బూత్‌లోనూ పోలింగ్ ప్రశాంతంగా ముగిసేలా పోలీస్ సిబ్బంది పటిష్టంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ ఎం.దీపిక చెప్పారు. పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో నియోజకవర్గంలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్, ఎన్నికల ప్రత్యేక బెటాలియన్ సిబ్బందికి పోలింగ్ ముందురోజు, పోలింగ్ రోజు పాటించాల్సిన చర్యలపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి గొడవలు, వివాదాలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల ఆవరణలో గుర్తింపు కలిగిన వ్యక్తులు మాత్రమే ఉండాలని ఇతరులు లేకుండా చూడాలని చెప్పారు. డీఎస్పీ ఏఎస్.చక్రవర్తి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షణ్ముకరావు, ఎస్‌ఐలు కె.కిరణ్‌కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించండి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

బొండపల్లి: ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున వడ దెబ్బకు గురికాకుండా గ్రామాల్లో ప్రజలకు జాగ్రత్తలు సూచిస్తూ అవగాహన కల్పించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి(డీఎంహెచ్‌ఓ) ఎస్.భాస్కరరావు వైద్య సిబ్బందికి సూచించారు. దేవుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎం లు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బందితో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు వైద్యసేవలు సక్రమంగా అందించాలని, గర్భిణులు, బాలింతలకు నెలవారీ టీకాలు సకాలంలో వేయాలని సూచించారు. హైరిస్క్ గర్భిణుల ప్రసవాలు పీహెచ్‌సీలో జరిగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వైద్యాధికారి బి.సత్యవతి, ఎంపీహెచ్‌ఈఓ అప్పలనాయుడు, పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి చూసి ఓటు వేయండి


గుజ్జింగవలసలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

• ఎన్నికల ప్రచారంలో మంత్రి బొత్స సత్యనారాయణ

గుర్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈఅయిదేళ్లలో పేదలకు అందించిన సంక్షేమం, గ్రామాల్లో చేసిన అభివృద్ధిని చూసి ఫ్యాన్ గుర్తుపై ఓటెయ్యాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రజలను అభ్యర్థించారు. మండలంలోని ముద్దాడపేట, కొండగండ్రేడు, పల్లిగండ్రేడు, గుజ్జింగి వలసలో శుక్రవారం ఆయన ఎన్నిక ల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రచారసభల్లో ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కుట్రలు, కుతంత్రాలు చేసి పేదవాడికి సంక్షేమ పథకాలు అందకుం డా చేస్తున్నారని ఆరోపించారు. వలంటీర్ల ద్వారా ఇంటి వద్ద పింఛన్ పంపిణీ చేయనీయకుండా అడ్డుకున్నా రని, టీడీపీ నాయకుల తీరుతో చీపురుపల్లి నియోజకవర్గంలో ఇద్దరు వృద్ధులు పింఛన్ తీసుకోవడానికి బ్యాంకులకు వెళ్లి మరణించారని తెలిపారు. పేదవాడి ఆకలితో రాజకీయాలు చేయడం సిగ్గుచేటు అని అన్నారు. వృద్ధులకు ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయాన్నే ఇంటి వద్దే ఠంఛన్‌గా పింఛన్ అందాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే రావాలన్నారు.ఎవరు ఎన్నికుట్రలు చేసినా జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, జూన్ నాలుగు తర్వాత యథావిధిగా సంక్షేమ పథకాలన్నీ పేదవాడి ఇంటి వద్దకే వస్తాయన్నారు. నాడు–నేడులో భాగంగా కొండగండ్రేడు హైస్కూల్‌లో రూ.1.30 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. విద్యార్థులకు విద్యాకానుక పేరుతో పాఠ్య,నోట్ పుస్తకాలు, బ్యాగులు, బూట్లు, యూనిఫాం దుస్తులు, ఇతర విద్యాసామగ్రి అందజేశామని, గోరుముద్ద పథకం పేరుతో పౌష్టికాహారం అందించామన్నారు. లంచాలకు తావులేకుండా, దళారుల ప్రమేయం లేకుండా ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందించామని చెప్పారు. టీడీపీ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు కనీసం అభివృద్ధి , సంక్షేమం చేయలేదని , అటువంటి వారు మళ్లీ గ్రామాల్లోకి వచ్చి కల్లబొల్లి మాటలు చెబుతున్నారని, వారిని నమ్మవద్దని సూచించారు. ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లేసి ఎమ్మెల్యేగా తనను, విజయనగరం ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు, జేసీఎస్ కన్వీనర్లు బెల్లాన బంగారునాయుడు, కెంగువ మధుసూదనరావు, నాయకులు వరదా ఈశ్వరరావు, సారిక గోవింద్, మణ్యపురి రామారావు, సురేష్, రెడ్డి అప్పలనరసయ్య, అట్టాడ అప్పలరాజు, రెడ్డి మురళి, అట్టాడ రామకృష్ణ పాల్గొన్నారు.

బూటకపు హామీలను నమ్మవద్దు

• ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య


గజపతినగరంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ సురేష్ బాబు


బోడసింగిపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

బొండపల్లి: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఇస్తున్న బూటకపు హామీలను, మాయమాటలను నమ్మి మోసపోవద్దని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ప్రజలకు సూచించారు. మండలం లోని బోడసింగిపేట గ్రామంలో శుక్రవారం ఆయన ఎన్నికలు ప్రచారం చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మేనిఫెస్టోలో చంద్రబాబు సూపర్ సిక్స్ పేరిట కొత్తడ్రామాలకు తెరతీశారని, అవన్నీ బూటకపు హామీలేనని అన్నారు. 2014 ఎన్నికల్లో ఇంటికో ఉద్యోగం ఇస్తా నని, రైతులు, డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ చేస్తానని, ఇలా 600కు పైగా హామీలు ఇచ్చి చంద్రబాబు అధికారంలోకి వచ్చారని, వాటిలో ఏ ఒక్కటీ అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. సీఎం జగన్ మాటఇస్తే తప్పరని, 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారని చెప్పారు. సంక్షేమ, అభివృ ద్ధి పాలన సాగించిన జగన్ మోహన్‌రెడ్డికి మళ్లీ పట్టం కట్టాలని ప్రజలను కోరారు. ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా తనని, విజయనగరం ఎంపీగా బెల్లాన చంద్ర శేఖర్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. పార్టీ మండల అధ్యక్షుడు బోడసింగి జగదీశ్వరరావు, నాయకులు బి.జగ్గునాయుడు పాల్గొ న్నారు.

గజపతినగరంలో..

గజపతినగరం: మండల కేంద్రంతో పాటు ఎం.వెంకటాపురంలో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ డాక్టర్ పి.వి.వి. సూర్యనారాయణరాజు(సురేష్ బాబు), జెడ్పీటీసీ గార తవుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా వెంకటాపురంలోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసి ప్రచారం ప్రారంభించారు.

బాల్య వివాహాలతో అనర్థాలు


ర్యాలీ చేస్తున్న సోషల్ వర్కర్స్, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు

చీపురుపల్లిరూరల్(గరివిడి): బాల్య వివాహాలు అనర్థాలకు దారితీస్తాయని, చట్టరీత్యా నేరమని అంగన్‌వాడీ, ఆశ, సామాజి క కార్యకర్తలు అన్నారు. అక్షయ తృతీయ పర్వదినం సందర్భంగా బెజ్జిపురం యూత్ క్లబ్, ఎన్‌జీఓ ఆధ్వర్యంలో గరివిడి మండలంలోని గెడ్డపువలస గ్రామంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఎవరైనా బాల్య విహహాలు చేసేందుకు సిద్ధపడితే 100, 1098, 112, 18001027222 టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. సోషల్ వర్కర్ వి.పద్మ, సచివాలయ మహిళా పోలీస్, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు పక్కాగా ఏర్పాట్లు


మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శాంతి

చీపురుపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు పూర్తి చేశామని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ బి.శాంతి చెప్పారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 13న ఉదయం 7 గంటల నుంచి సాయం త్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరుగుతుందని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని 257 పోలింగ్ స్టేషన్లలో పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కేంద్రాల వద్ద టాయిలెట్ల సదుపాయం, వృద్ధులు, దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంప్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. గరివి డిలోని ఎస్‌డీఎస్ అటానమస్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈనెల 12న ఎన్నికల సామగ్రిని పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. 257 పోలింగ్ కేంద్రాల్లో 147 చోట్ల వెబ్ కాస్టింగ్ నిర్వహిస్తామన్నారు.పోలింగ్ కేంద్రాలను 33 రూట్లుగా విభజించి 33 మంది సెక్టోరియల్ అధికారులను నియమించామన్నారు. చీపురుపల్లి మండలం లోని మెట్టపల్లి గ్రామంలో 165వ పోలింగ్ బూత్ పరిధిలో అత్యధికంగా మహిళా ఓటర్లు ఉండడంతో ఆ కేంద్రాన్ని పింక్ పోలింగ్ బూత్‌గా గుర్తించామన్నారు. ఈ బూత్‌లో పోలింగ్ సిబ్బంది అంతా మహిళలే ఉంటారని స్పష్టం చేశారు.ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన పోలీసు బందో బస్తు ఏర్పాటు చేశామని వివరించారు.

జగన్‌తోనే పేదల ప్రగతి, అభివృద్ధి


చినగుడిపాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

• ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కడుబండి


రామస్వామిపేటలో కోలాటంతో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

వేపాడ: పేద, బడుగు, బలహీన వర్గాల ఆర్థిక ప్రగతి, రాష్ట్ర సమగ్రాభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగించారని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చినగుడిపాల, దబ్బిరాజుపేట,చామలాపల్లి, కరకవలస, గుడివాడ, జాకేరు, పి.కె.ఆర్.పురం, రామస్వామిపేట,బొద్దాం, ఓబలయ్యపాలెం, ముకుందపురం, పాటూరు, కొండగంగుబూడి గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు కోలాటాల, డప్పు వాయిద్యాలతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టి, గుమ్మడి కాయలతో దిష్టి తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల రూపంలో మేలు జరిగిందన్నారు. సంక్షే మం, అభివృద్ధి కొనసాగాలంటే ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, విశాఖపట్నం ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయకుమార్, డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, ఏఎంసీ చైర్‌పర్సన్ మూకల కస్తూరి, పార్టీ మండల అధ్యక్షుడు జగ్గుబాబు, డాక్టర్ పి.వరలక్ష్మి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, జేసీఎస్ కన్వీనర్ బోజంకి శ్రీను, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు శ్రీను, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.